

# జాలి

శ్రీరంగం శ్రీనివాసరావు

"ఎలాగైనా నీకు జాలి ఎక్కువోయ్" అంటూంటాడు నా మిత్రుడు రామ్మూర్తి.

"మా ఆయనకి ఊళ్ళోవాళ్ళందరిమీదా కలిగే జాలిలో వెయ్యోవంతైనా నామీద కలగదు" అని కోపం వచ్చినప్పుడు మా ఆవిడ అవతలి వాళ్ళదగ్గర నా గురించి సాధిస్తూ అనే మాటలు.

"వాడిదంతా వాళ్ళ నాన్న పోలికే. ఆయనా ఇలాగే జాలి ఎక్కువైపోయి ఆస్తంతా దానధర్మాలకి తగలెట్టుకున్నాడు" అని, తండ్రి తాగుబోతూ, వ్యభిచారీ అయినపుడు కొడుక్కికూడా అవే అలవాట్లు సంక్రమిస్తే ఎలా అంటారో అచ్చు అలాగే అనేవాడు మామయ్య.

"ఆఁ పోదూ. అదొక రకం 'షో' అంతే" అని నా తోటివాళ్ళు నేను లేని సమయాల్లో అనుకుంటూ ఉండడంకూడా నే నెరుగుదును.

మొత్తం మీద వీటన్నిటివల్లాకూడా మామూలుగా మనిషన్నవాడికి ఉండాల్సిన జాలికన్నా నాలో అది చాలామట్టుకు ఎక్కువగానే ఉందన్న విషయాన్ని మాత్రం యావత్తుమందీకూడా నిస్సందేహంగా తేల్చేశారు. ఒక్క నేను తప్ప.

నా అభిప్రాయం మటుకు అందుకు పూర్తిగా వ్యతిరేకం. ఎందుకంటే మనం ఉన్న స్థితికన్నా తక్కువ స్థితిలో ఉన్న వాడికి ఏదైనా సాయంచెయ్యడం జాలి అని నేననను. అది మనిషి తాలూకు కనీస ధర్మం. అదీకాక ఒక చదువుకునే బీదకుర్రాడికి రెండ్రూపాయ లిస్తేనూ, రోడ్డుప్రక్క ముష్టివాడికో అయిదుపైసలు వేస్తేనూ అది జాలి అనిపించుకుంటుం దేమో నాకు తెలియదు. కాని నేనుమాత్రం అవేమీకూడా జాలి అన్న ఉద్దేశంతో చెయ్యలేదు. అసలా మాటకొస్తే వాళ్ళని చూసినప్పుడు కలిగే భయంవల్లమాత్రమే చేసేవాడిని.

దిక్కులేని వాళ్ళని చూసినప్పుడల్లా నాకు వెంటనే నేనే ఆ పరిస్థితిలో ఉంటేనో అనిపించి చెప్పలేని భయం వేస్తుంది. అంతేకాక అటువంటప్పుడు నాకెలా అని పిస్తుంది అనికూడా అనుకుంటూ ఉంటాను. అయితే వాళ్ళా పరిస్థితిలో నేనీ రకంగానూ పుట్టడం ఎలా జరిగిందో నాకు తెలియని సంగతుల్లో వొకటి. బహుశా అందరూ అనుకునేటట్లే భగ వంతు డనేవా డొకడుంది. వాడే ఇలా పుట్టించాడేమో? కాని భగవంతుడే చేసిన అట్నుంచిటు మార్చి చేసుంటే నేనలాగే ఉండాల్సిందేమో అని తలుచుకొని భయ పడుతూ ఉంటాను.

అంచేత నేను చేసే చిన్నచిన్న దానా లన్నీ జాలివల్లే చేసినవి కావని వొప్పు కోవాలి. నే నుండకుండా అటువంటి దరిద్రపు స్థితిలో ఇంకొక రున్నందుకు, తద్వారా నన్ను దాన్నుంచి కాపాడి నందుకూ వాళ్ళకి నే నిచ్చే ఒకరకమైన లంచం అది.

* *

దేశం కాని దేశంలో ఉన్న ఆ మహా నగరానికి నేను వెళ్ళడం చాలా అనుకో కుండా తటస్థించింది. నేను చేసే వ్యాపా రానికి సంబంధించిన వో ముఖ్యమైన వ్యక్తి ఆ దిక్కుమాలిన చోట ఉండటం వల్ల నా కా ప్రయాణం తప్పలేదు.

చిన్నతనంలో ఎప్పుడైనా సరే మా నాన్నగారు ఎంత ఆయన ఆఫీసుపనిమీద వెళ్తున్నప్పటికీ ప్రయాణం అంటే చాలు ఆయన వెనకే నేనూ తోకలాగ తయా రయ్యేవాడని. అయితే చిన్నతనంలో సరదాగా అనిపించేది ప్రయాణం అంటే. కాని అది చిన్నతనంతోనే వోయింది.

ఇప్పుడు ప్రయాణం అనగానే అదొక రకమైన వికారం పుట్టుకొస్తుంది. ఎందు కంటే శుభ్రంగా యింటిపట్టున వేళకింత తిని కూర్చోకుండా, అనవసరంగా డబ్బు దండుగ, నిద్రదండుగ, అనారోగ్యం




తప్ప వాటిలో ఇంకేం లేదనిపిస్తుంది.

అయితే తప్పనిసరి గావడంవల్ల రెండ్రోజులపాటు రైల్లో చచ్చీ చెడి ప్రయాణంచేసి ఆ పట్టణం చేరుకొని ఒక చిన్న హోటల్లో దిగేను. అదృష్టం బావుండడం వల్ల ఆ రోజు సాయంత్రానికల్లా నా పని పూర్తయిపోయింది. తిరిగి అర్ధరాత్రి బండిలోనే తిరుగుప్రయాణం పెట్టుకున్నాను.

సాయంత్రం స్నానంచేసిం తర్వాత ఏంచెయ్యాలో తెలీక సరే ఊరు చూద్దాం వనుకున్నాను. కాని ఊరంతా చూడాలంటే చాలారోజులు పడుతుందని ముందే తెలిసిపోయింది. దాంతో హోటలికి దగ్గరగా ఉన్న బజార్లో మాత్రమే తిరగడం మొదలుపెట్టాను. దానివల్ల యింకొక సదుపాయంకూడా ఉంది. అదేవిటంటే, ఎటో పడి పోయినామంటే తిరిగి రావడానికి తోవతెలీక నానా అవస్థా పడాలి. ఈ లోపల రైలు కాస్తా దాటిపోవచ్చు. అందువల్ల దగ్గర బజారే నయమనిపించింది.

పేవ్‌మెంటు మీద నడుస్తూ ప్రక్కనున్న షాపుల్ని. వాటిలో మనుషుల్ని.

నన్ను తోసుకుంటూ పోతున్న జనాన్ని చూస్తే ఆశ్చర్యం వేసింది. ఇంతమంది ఏం పనులు చేస్తూంటారో తెలీక. కాని వాళ్ళు మాటాడుకొనే భాష నాకు పూర్తిగా రాకుండా పోకపోయినా బాగామాత్రం రాదు. అందువల్ల ప్రొద్దుటినుంచీ ఎవడితో మాట్లాడదావన్నా తడుముకోవాల్సొస్తోంది. అసలు ప్రపంచంలో యిన్ని వందల భాష లున్నందుకు కోపంకూడా వచ్చింది.

నేనిలా నానా రకాలుగా అనుకుంటూండగా "సాబ్, సాబ్" అన్నమాటలు నన్నుగురించే నన్న ఆలోచన రావడంతో ఆ మాటలన్న పెద్దమనిషికోసం చూశాను. అయితే అతను పెద్దమనిషి కాకపోవడమే కాకుండా కనీసం పెద్దవాడుకూడా కాదు. అతనో పది, పన్నెండేళ్ళ కుర్రవాడు. అతని జుట్టు చిన్న మూకుడు బోర్లించినట్లుగా ఉంది. అతని లాల్చీ అతని కొలతకి కుట్టింది కాదన్న సంగతి గుడ్డివాడికైనా (తడుముతే) తెలిసేలా ఉంది. దానికుండాల్సిన గుండీల్లో అన్నీ వూడిపోయి ఒక్కటిమాత్రం ఇంకా నిలబడి దాని రెండు చివరల్ని కలిపి ఉంచింది. అయితే లాల్చీ రంగుమాత్రం చెప్పుకోవడం కష్టం. దానికో జేబు సగం ఊడి మిగతా సగంవల్ల యింకా వేలాడుతోంది. ఆ లాల్చీ క్రింద ఒక అంగుళం మాత్రం పైకి కనిపించి మిగతా భాగం లాల్చీ క్రింద దాక్కున్న పొట్టి నిక్కరుంది.

ఆ కుర్రాడి మొహంలో ఆత్రుత కనిపించింది. నేను వెంటనే "ఏమిట"ని అడిగేను. వాడు వెంటనే గబగబా మాట్లాడ్డం మొదలుపెట్టాడు. దాని సారాంశం వాడు నా బూట్లకి పాలిష్ చేస్తానన్నది. కాని నేనా రాత్రికే పోవాలి కాబట్టి, ఎలాగా మళ్ళీ వాటినిండా దుమ్ము తప్పదు. అంచేత పాలిష్ అనవసరం అని వద్దన్నాను.

వాడు వెంటనే వెళ్ళిపోలేదు. బతిమాలడం మొదలుపెట్టాడు. నేనే అపూట బేరం అన్నాడు. ప్రొద్దుటినుంచీ తిండి లేదన్నాడు. పాలిష్ బ్రహ్మాండంగా చేస్తానన్నాడు. కేవలం 'చారానా' చాలన్నాడు. నాలాంటి వాళ్ళే కాదంటే వాడి గతేవిటన్నాడు. పాలిష్ నచ్చితేనే డబ్బిమ్మన్నాడు. లేకపోతే ఇంకేదో చెయ్యమన్నాడు.

వాడిని చూస్తూవుంటే నాకు 'అయ్యో' అనిపించింది.

"సరే" అని వాడిచేత పాలిష్ చేయించుకోవడానికి ఒప్పుకున్నాను. సంతోషంతో వాడు గబగబా పేవ్‌మెంటు మీద వో మూలగాఉన్న తన సామాను వేపు దారితీశాడు. నేనూ అటు వెళ్ళాను. నా బూట్లు విప్పి వాడిముందుంచాను. వాడు వాటిని శుభ్రంగా తుడుస్తూ మళ్ళీ మాటలు మొదలుపెట్టాడు.

దీనికి మామూలు పాలిష్ అయితే అంత అందంగా ఉండదుట. ఇటువంటి వాటికి వాడే కలర్ పాలిష్ తనదగ్గ రుందిట. అది వేస్తే మళ్ళీ చాలాకాలం దాకా బూట్లగురించి ఆలోచించే పని లేదుట. వాటిల్లో మొహం చూసుకో వచ్చుట. అందువల్ల అది వేయించుకో మన్నాడు. పెద్ద ఖరీదు కాదని హామీ యిచ్చాడు.

దాంతో నాకు వాడంటే కొంచెం సరదా వేసింది. పోన్లే అనుకొని వాడితో సరే అదే కానిమ్మన్నాను. వాడికి ఉత్సాహం పెరిగింది. మళ్ళీ బూట్లతో కుస్తీ ప్రారంభించి మళ్ళీ ఆరంభించాడు.

ఈ ప్రకారం బూట్లు వాడితే వాటి అడుగునున్న సోల్ తొందరగా అరిగి పోతుందన్నాడు. తరువాత రీ సోలింగ్ చేయించినా లాభం లేదన్నాడు. పైతోలు దెబ్బ తినేస్తుందన్నాడు. అందువల్ల తిరిగీ కొత్తజోళ్ళు కొనుక్కోవాల్సి వస్తుం దన్నాడు. ఇప్పుడు బూట్ల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నాడు. అందువల్ల వీటినే జాగ్రత్తగా వాడుకోవాలన్నాడు. దానికోసం 'సాబ్' వెంటనే వీటికి అడుగున నాడాలు వేయించుకున్నట్లయితే యిహ జీవితాంతం చెక్కు చెదరవన్నాడు. కేవలం ఒక్కొక్క నాడా పదిపైసలే నన్నాడు. పది నిముషాల్లో వేసేస్తా నన్నాడు.

ఈసారి నాకు నవ్వొచ్చింది. వాడి వ్యాపారదక్షతకి ముచ్చటవేసింది. అంత చిన్నతనంలో అంత తెలివితేటలుగా మాట్లాడ్డం ఆశ్చర్యం వేసింది. పోనీ ఎంతకనక? అంతా కలిపి రూపాయి చిల్ల రవుతుంది. అందులో పెద్ద నాకు వచ్చిన నష్టంకూడా లేదు. బూట్లుకూడా అరగ కుండా ఉంటాయి. వాడికీ పాపం వో రూపాయిచ్చినట్లూ ఉంటుంది. అందుచేత అలాగే చెయ్యమని అదంతా అయ్యేదాకా అక్కడే నించోవడం విసుగనిపించి కొంచెం పక్కగా ఉన్న షాపులు పరిశీలించడం మొదలుపెట్టాను.

ఓ ఇరవై నిముషా లయ్యాక తిరిగి వాడిదగ్గర కొచ్చేసరికి బూట్లు నిగనిగ లాడుతూ చక్కగా కనపడ్డాయి. కుర్రాడు పరవాలేదనిపించింది. పర్సుతీసి 'ఎంత'ని అడిగేను. వాడు "ఆరురూపాయల" న్నాడు. నాకు అర్థంకాలేదు. మళ్ళీ అడిగేను. అయితే వాడు మామూలుగానే "అంతే" అన్నాడు. నాకు ఆశ్చర్యం. దాన్ని మించి కోపం వచ్చాయి. 'ఎలాగ' అని గట్టిగానే అన్నాను.

వాడు తొణక్కుండా బూట్లు చేత్తో పట్టుకొని చెప్పాడు. మామూలు పాలిషయితే పావలాట. కాని కలర్ పాలిషయితే రెండురూపాయలట. ఒక్కొక్క నాడా పదిపైసల చొప్పున నలభై నాడాలు నాలుగురూపాయలట. అంచేత రెండూ

కలిపితే ఆరురూపాయలని లెక్కని విడ మరచి చెప్పాడు.

అయితే నాకు నలభై నాడాలంటా దేవి టని అదేవిటన్నాను. వాడు బూట్లు తిర గేసి చూపించాడు. ఒక్కొక్క బూటు క్రింద అంగుళం అయినా ఖాళీ లేకుండా నాడాలతో తాపడం చేసుంది. నాకు వెర్రెత్తింది.

"ఇన్నెవరు కొట్టమన్నారు?" అన్నాను.

"మరింకెన్ని?" అన్నాడు అదోలా.

"ఒక్కొక్కదానికి మూడుచొప్పున కాదా కొట్టాల్సింది?" అన్నాను.

"మీ రలా చెప్పందే," అన్నాడు.

ఇంతలో అటూ యిటూ షాపులవాళ్లు, పోతున్న జనం ఆగి పల్లెటూరివాడిని చూసినట్లు చూస్తున్న ట్లనిపించింది. అది చూసి వాడు మరీగట్టిగా మాట్లాడ్డం మొదలు పెట్టాడు. దానితో నాకు యింకా అక్కడ వాదన వేసుకోవడం, అరవడం చిరా కనిపించి మాట్లాడకుండా ఆరురూపా యలు వాడిముందు పడేసి జోళ్ళు తొడు క్కొని వచ్చేశాను.

* *

తరువాత రైల్లో నా కది జ్ఞాపకం వచ్చి ఆలోచిస్తే వాడు నన్ను మోసం చేశాడని తెల్సినా ఎందుకో నాకు కోపం మాత్రం రాలేదు. ఎందుకంటే పాపం వాడిదికూడా అందరిలాంటి బతుకే ననీ వాడిమీదా ఇంకెవరో ఆధారపడి బతుకు తూండొచ్చనీ, అస్తమానూ వాడికి నా లాంటి క్రొత్తవాళ్ళు దొరకరనీ, అటు వంటి రోజున వాడికి పండుగేననీ అను కొని, పోన్లే పాపం కనీసం యీ వొక్క రోజన్నా నాపేరు చెప్పుకొని ఆనందంగా గడుపుతా డనుకున్నాను.

కాని అంత చిన్నతనంలోనే ఇటువంటి మోసాలు నేర్చుకున్నవాడు పెద్దయిన తరువాత ఏంచేస్తాడో ఊహించడం అంత కష్టం కాదు. బహుశా, జేబులు కత్తిరించొచ్చు, దొంగతనాలు చెయ్యొచ్చు. ఇంకా ఏమైనా చెయ్యొచ్చు. అవి చేసి నపుడు వాడు అనుభవించబోయే శిక్షలు తల్చుకొని వాడిని అందులో ఊహించే సరికి నాకు వాడంటే విపరీతమైన జాలి వేసింది.

తిరిగొచ్చిం తర్వాత యీ కథ చాలా మందితో చెప్పాను. విన్నవాళ్ళంతా అయిపోయిన తరువాత వెధవమొహం పెట్టి "నువ్వెందుకూ పనికిరావోయ్" అన్నారు.

అయితే ఒక్క మా ఆవిడమాత్రం ఇదంతా విని ఏమీ అనలేదు కాని నావేపు జాలిగా చూపింది. ఎందుకో మరి?